క్లుప్తంగా...

సెయింట్స్ మేరీస్ ఫీస్ట్ కోసం ప్రత్యేక బస్సులు

బన్సీలాల్‌పేట్: మాసాబ్‌ట్యాంక్‌లో ఈ నెల 8న జరిగే సెయింట్ మేరీస్ ఫీస్ట్ కార్యక్రమం కోసం సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రాణిగంజ్ ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీ ధర్మ చెప్పారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సికింద్రాబాద్ నుంచి మాసాబ్‌ట్యాంక్ వరకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఉ 5.30 గంటల నుంచి రాత్రి 10.30 వరకు ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందన్నారు. 99592 26147, 99669 61800 కు కాల్ చేయాలన్నారు.

నేటి నుంచి ఆలయ పునరుద్ధరణ పనులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ శివాజీనగర్‌లోని200 ఏళ్ల చారిత్రాత్మక పెరుమాళ్ వెంకటేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణ పనులు ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వై నర్సారెడ్డి తెలిపారు. దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సభ్యులతో కలిసి కరపత్రాన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వెంకటేశ్వర స్వామి బాలాలయాల ప్రతిష్ట పూజా కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. దాతల సహాయంతో సుమారు రూ.60–70లక్షల వ్యయంతో రాజగోపురం, గర్భాలయం, అమ్మవారి ఆలయం, కృష్ణాలయంలో ఈ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.

గృహలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గృహలక్ష్మి పథకం దరఖాస్తులను అందజేస్తున్న దృశ్యం

బౌద్ధనగర్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ లక్ష్మీ పథకాన్ని అర్హులైనవారందరూ దరఖాస్తు చేసుకోవాలనీ బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఈ మేరకు గురువారం ఏకశిలా అంబర్‌నగర్‌లో గృహ లక్ష్మీ పథకం దరకాస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నేతలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొరవి కృష్ణస్వామికి ఘన నివాళి



సికింద్రాబాద్: హైదరాబాద్‌నగర తొలి మేయర్, ముదిరాజ్ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కొరవి కృష్ణస్వామి జయంతి వేడుకలు గురువారం సీతాఫల్‌మండి కూడలిలో ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్ ముదిరాజ్ సంఘం నిర్వహించిన వేడుకలకు సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, వివిధ పార్టీల నాయకులు సంజీవ్‌ముదిరాజ్, కనకట్ల హరి, గణేశ్‌ముదిరాజ్, లలిత, నిర్మల, సతీష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ నూతన జీఎంకు సత్కారం



నూతన జీఎంను సత్కరిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) నూతన జనరల్ మేనేజర్ జీఎస్ రాజును ఎఫ్‌సీఐ ఎస్ఎల్‌సీసీ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. జనరల్ మేనేజర్‌గా ఆయన ఇటీవలే బాధ్యతలు స్వీకరించడంతో కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా ఆయనను కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన నియామకపం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌సీసీ కమిటీ సభ్యులు వినోద్ సంచేతి, సత్యమూర్తి, మహ్మద్ రిజ్వాన్, తిరుపతి, సురేందర్‌గౌడ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి

సికింద్రాబాద్: గణపతి నవరాత్రి వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని వారాసిగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి కోరారు. గురువారం నామాలగుండులోని బీఎస్ఆర్ గార్డెన్‌లో చిలకలగూడ పోలీసులు గణపతి మండప నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు మట్టంరాజు, మధులత, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి సంబురాలు



హిందూ పబ్లిక్ స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి సంబరాల్లో చిన్నారుల ఆట పాట

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లో గురువారం శ్రీకృష్ణాష్టమి సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నారి విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ముచ్చటగొల్పారు. సినీ గీతాలకు లయబద్ధంగా చేసిన నత్యాలు ఆహుతులను కట్టిపడేశాయి. చిలిపి చేష్టలతో చిన్ని కష్ణయ్యలు మురిపించారు.. గోపికలతో జతకట్టి నాట్యమాడి మైమరిపించారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన ఉట్టిని కొట్టేందుకు పోటీ పడ్డారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు శ్రీకష్టాష్టమి విశిష్టతను తెలియపర్చారు. ట్రస్ట్ ఉపాధ్యక్షురాలు చంద్రకళాయాదవ్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ హెచ్ఎస్ త్రిపాఠి, ట్రస్ట్ సభ్యులు సూర్యనారాయణ, ప్రిన్సిపల్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

లాలాపేట: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం తార్నాక డివిజన్ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించి మురిసిపోయారు. ఇందులో భాగంగా లాలాపేట లక్ష్మీనగర్‌లోని శ్రీ దుర్గా హైస్కూల్లో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఎం. నర్సింహ్మారెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్‌లో..

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో గురువారం శ్రీ క్రిష్ణజన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పాన్‌బజార్‌లోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. బోయిగూడ, బన్సీలాల్‌పేట్, పద్మారావునగర్, రాణిగంజ్, మోండా మార్కెట్ తదితర ప్రాంతాల్లోని దేవాలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి.

సాయిబాబా దేవాలయంలో....

సికింద్రాబాద్ బోయిగూడ రైల్వే బ్రిడ్జి సమీపంలోని శ్రీసాయిబాబా దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి, బీజేపీ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో గోపి, డి. ప్రవీణ్ కుమార్, శివలింగం, ఈశ్వర్, గుంటి సత్యనారాయణ, నరేష్, చంద్రపాల్‌రెడ్డి, స్వామి, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ దుర్గా హైస్కూల్లో..

ఘనంగా జన్మాష్టమీ వేడుకలు

బౌద్ధనగర్: తెలంగాణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం వారసిగూడలో శీకృష్ణ జన్మాష్టమీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ మేయర్, బీజేపీ రాష్ట నాయకురాలు బండ కార్తీకరెడ్డి ముఖ్యతిధిగా హాజరై శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ భగవంతుని ఆశీస్సులతో ప్రజలందరికి శుభాలు కలుగాలనీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు టెంపుల్ సాయి, లడ్డు, రాజేష్, నిర్వాహకులు యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్: రాష్ట యాదవ మహాసభ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని మహబూబ్ కళాశాల ఆవరణలో బుధవారం రాత్రి శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు మధ్య శ్రీ కృష్ణుడి జన్మదిన వేడుకలను కన్నుల పండువగా చేశారు.

సనత్‌నగర్: ఎస్పీరోడ్డులోని వీర హనుమాన్ ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి పాల్గొన్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కోలాహలంగా మారాయి.

ఇస్కాన్‌లో ఆలయంలో..



ఇస్కాన్‌లో పూజలు చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ సంగీత్ థియేటర్ ప్రాంతంలోని ఇస్కాన్ దేవాలయంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గురువారం తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారులుతీరారు. అర్ధరాత్రి వరకు వివిధ రకాల ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అలాగే భక్తులకు ప్రసాదాల పంపిణీ చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించడంతో పాటు జ్ఞాపికను బహూకరించారు.





వేడుకల్లో పాల్గొన్న మాజీ మేయర్ కార్తీకరెడ్డి



సాయిబాబా దేవాలయంలో..



సీతాఫల్‌మండిలో వేడుకలకు హాజరైన డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, మంత్రి మహమూద్ అలీ



పాన్‌బజార్‌లోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాయంలో జరిగిన వేడుకల్లో మంత్రి తలసాని

కస్టమర్ కేర్‌కు ఫోన్ చేస్తే.. బ్యాంక్ ఖాతా ఖాళీ..

సనత్‌నగర్: మొబైల్ రీచార్జ్ కోసం ఓ మహిళ కస్టమర్ కేర్ నెంబర్‌కు ఫోన్ చేస్తే తన ఖాతాలోని రూ.61,895ల నగదు మాయం అయిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ప్యారడైజ్ సమీపంలోని బలరాం ప్రాంతంలో నివసించే శారద తన జియో ఫోన్ రీఛార్జ్ చేసింది. అయితే రీచార్జ్ కోసం ఖాతాలో డబ్బు మినహాయించబడినప్పటికీ రీచార్జ్ మాత్రం కాలేదు. దీంతో ఆమె జియో వెబ్‌సైట్ నుంచి కస్టమర్ కేర్ నెంబర్ తీసుకుని ఫోన్ చేసింది. ఫోన్ ఎత్తిన అవతలి వ్యక్తికి తన సమస్య చెప్పింది. కొద్దిసేపటి తర్వాత కాల్ కట్ అయ్యింది. అగంతకులు వేరొక నెంబర్‌తో బాధితురాలికి ఫోన్ చేశారు. ఆమె మొబైల్ ఫోన్‌లో ఎనీడెస్క్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వారి మాటలను నమ్మిన ఆమె సదరు యాప్ డౌన్‌లోడ్ చేసుకుని లింక్ నెంబర్‌ను అగంతకుడికి చెప్పింది. దీంతో ఆమె ఫోన్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్న అగంతకుడు ఆమె పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఖాతాల నుంచి రూ.61,895 నగదు మాయం చేశాడు. తాను మోసపోయాయని గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్ వేషంలో బలవంతపు వసూళ్లు

సనత్‌నగర్: ట్రాన్స్‌జెండర్ వేషధారణతో డబ్బులు వసూలు చేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్న వ్యక్తిని బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గోవాలోని పనాజీకి చెందిన అంకిత్‌నాయక్ (21) ట్రాన్స్‌జెండర్ వేషంలో పరేడ్‌గ్రౌండ్ సమీపంలోని టివోలీ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులను కలిగించడంతో పాటు దుకాణదారులు, పాదచారుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నాడు. దీంతో స్థానికులు ఫిర్యాదు చేయడంతో అక్కడే పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ఎస్ఐ గంగాధర్, ఇతర సిబ్బంది అక్కడికి చేరుకుని అంకిత్‌నాయక్‌ను పట్టుకున్నారు. అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కృష్ణస్వామి ముదిరాజ్ సేవలు చిరస్మరణీయం



జయంతి ఉత్సవావలను ప్రారంభిస్తున్న కాసాని జ్ఞానేశ్వర్

బన్సీలాల్‌పేట్: ముదిరాజ్ జాతితో పాటు పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం నగర మాజీ మేయర్ కె. కృష్ణస్వామి ముదిరాజ్ చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం సికింద్రాబాద్ బోయిగూడ ముదిరాజ్ భవన్‌లో కె. కృష్ణస్వామి ముదిరాజ్ 130వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, అఖిల భారత ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు విద్యా, ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా అభివృద్ధి చెందాలని కోరారు. గుంటి రాజాపతి, చెన్నయ్య, సదానంద్, కాసాని సాయి పాల్గొన్నారు.

మానవులందరూ సమానమే



సెంటర్‌ను ప్రారంభిస్తున్న కార్డినల్ పూల ఆంథోని


రాంగోపాల్‌పేట్: మనుషులందరూ సృష్టిలో భాగమేనని అందరూ సమానమని హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ పీఠాధిపతులు, కార్డినల్ పూల ఆంథోని అన్నారు. హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ సోషల్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో ట్రాన్స్ కమ్యూనిటీ కోసం ఏర్పాటు చేసిన జూట్ బ్యాగ్ ట్రెనింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోప్ మాటలను గుర్తు చేస్తూ మనుషులందరికి ఒకే విధంగా చూస్తూ గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ సందర్భంగా హాస్ డైరెక్టర్ మాదాసు ఆంథోనీ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా ముత్తూట్ బ్యాంక్ సికింద్రాబాద్ బ్రాంచ్ మేనేజర్ 15 కుట్టు మిషన్లు ఇప్పించి ట్రాన్స్‌జండర్స్ వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేసిన కృషిని ఆయన అభినందించారు. ముత్తూట్ మేనేజర్ వెంకట నారాయణ, నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారికి డ్రై రేషన్ కిట్స్‌ను అందించారు.

అక్టోబర్‌లో రైల్వే ఉద్యోగుల సహకార పరపతి పరిమిత సంఘం ఎన్నికలు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వెంకటరెడ్డి

రాంగోపాల్‌పేట్: దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగుల సహకార పరపతి పరిమిత సంఘం లిమిటెడ్ ప్రతినిధులు ఎన్నికలను అక్టోబర్ 10,12 తేదీల్లో నిర్వహిస్తున్నామని రిటర్నింగ్ అధికారి వెంకటరెడ్డి తెలిపారు. సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల వివరాలు వెల్లడించారు. హిమ్మత్‌నగర్‌లోని కార్యాలయంలో సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నామినేషన్ల పరిశీలన, 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల ఉప సంహకరణ ఉంటుందని చెప్పారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పరపతి సంఘంలో 5 రాష్ట్రాల నుంచి 42వేల మంది షేర్ హోల్డర్లు ఉన్నారని, 19 ప్రాంతాల్లో 192 బూత్‌లలో 42,214 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొని 210 మంది డెలిగేట్లను ఎన్నుకుంటారని చెప్పారు.అక్టోబర్ 10వ తేదీన హెడ్‌క్వార్టర్స్‌లో, 12వ తేదీన లైన్ సభ్యులు ఓటింగ్ ఉంటుందని తెలిపారు. ఎన్నికైన 210 మంది డెలిగేట్స్ నుంచి మళ్లీ ఎన్నిక ద్వారా 21 మంది డైరెక్టర్లు, అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని వివరించారు. సహాయ కార్యదర్శి రవిశంకర్, సహాయ ఎన్నికల అధికారులు సాయికుమార్, శేషు, శర్మ తదితరులు పాల్గొన్నారు. మరింత సమాచారం కోసం సంఘం వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.





కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

సనత్‌నగర్: రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సంవత్సరం పూర్తయిన సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు సనత్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలతో జై కాంగ్రెస్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. అనంతరం రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు.

లష్కర్‌లో కాంగ్రెస్ భారీ ర్యాలీ

సికింద్రాబాద్: భారత్ జోడో యాత్ర ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు సికింద్రాబాద్‌లో భారీ పాదయాత్ర నిర్వహించారు. వారాసిగూడ కూడలి నుంచి చిలకలగూడ కూడలి వరకు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నోముల ప్రకాశ్‌రావు నేతృత్వంలో నిర్వహించిన పాదయాత్రలో నియోజకవర్గంలోని ఐదు డివిజన్ల నుంచి పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేగంపటలో..

కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బేగంపేటలో నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గౌరపల్లి రమేష్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నినాదాలు చేస్తూ సందడి చేశారు.రాష్ట్రంలో అధికారం చేపట్టేది కాంగ్రెస్ పార్టీనేనని రమేష్ పేర్కొన్నారు.

కుటుంబ పాలన, అవినీతి పార్టీలను ఓడిద్దాం

రాంగోపాల్‌పేట్: కుటుంబ పాలనతో పాటు అవినీతితో దేశాన్ని దోచుకున్న బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు కేఏ పాల్ పిలుపునిచ్చారు. గురువారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో తెలంగాణాలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కేఏ పాల్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 54 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ అవినీతితో పాటు కుటుంబ పాలన సాగించాయని, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల పరిస్థితి అలాగే ఉందన్నారు. రానున్న సీపీఐ, సీపీఎం, బీఎస్పీ లాంటి పార్టీలో తమతో కలిసి వస్తే కలిసి పోటీచేస్తామని అన్నారు.

హైటెన్షన్ వైర్ల సమస్యను పరిష్కరించండి

లాలాపేట: తార్నాకలో జనవాసాల పై నుంచి ఉన్న హై టెన్షన్ విద్యుత్ వైర్లతో ప్రమాదం పొంచి ఉందని బాధితులు గురువారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డిని ఆమె కార్యాలయంలో కలిసారు. తార్నాకలోని స్ట్రీట్ నెంబర్ 10 , 11 ప్రాంతంలో పలు ఇండ్లపైన విద్యుత్ వైర్లు ఉండటం వలన తరచుగా విద్యుత్ ప్రమాదాల బారిన పడుతున్నామని డిప్యూటీ మేయర్‌కు వివరించారు. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి మాట్లాడుతూ ఇండ్లపై నున్న వైర్లను అధికారులతో కలిసి పరిశీలిస్తామన్నారు.

గ్యాస్ గోడౌన్‌ను తరలించండి

అమీర్‌పేట : బల్కంపేట రేణుకానగర్‌లోని నివాసాల నడుమ ఉన్న గ్యాస్ గోడౌన్‌ను తరలించేలా చూడాలని స్థానికులు సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు మర్రి శశిధర్‌రెడ్డిని కోరారు. గురువారం మర్రిని కలిసి సమస్యను వివరించి వినితి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జైహింద్‌గౌడ్, పాల్గొన్నారు.

రేపటి నుంచి చెస్ పోటీలు

కంటోన్మెంట్: డెక్కన్ క్లబ్, రాష్ట చెస్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో ఈ నెల 9,10 తేదీల్లో ఈస్ మారేడుపల్లిలోని డెక్కన్ క్లబ్ ఆవరణలో 'ది డెక్కన్ క్లబ్ తెలంగాణ స్టేట్ ఎలైట్ ఇన్విటేషన్ చెస్ చాంపియన్ షిప్ 2023' పోటీలు జరగనున్నాయని క్లబ్ అధ్యక్షులు బి. అనిల్ కుమార్ తెలిపారు. డెక్కన్ క్లబ్ కార్యదర్శి ఎం ఎస్ శ్యామ్, ఉపాధ్యక్షులు ఏ ముఖేష్, కోశాధికారి ఎం వెంకటేశ్వర్లు తెలంగాణ రాష్ట స్టేట్ అసోసియేషన్ అధ్యక్షులు కేఎస్ ప్రసాద్ లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఉద్యమకారుడు మల్లయ్యకు పరామర్శ

గాంధీఆస్పత్రి: కరీంనగర్‌లో ఆవేదనతో ఆత్మహత్యకు యత్నించి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణా ఉద్యమకారుడు మల్లయ్యను తెలంగాణా ఉద్యమకారుల ఫోరం పరామర్శించింది. ఫోరం నాయకులు భాస్కర్ గౌడ్, డాక్టర్ చీమ శ్రీనివాస్‌లు ఆయనను పరామర్శించి ధైర్యాన్ని అందించడంతో పాటు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఫరీదుల శ్రీనివాస్‌గౌడ్, వీరస్వామి, రాష్ట్ర కో కన్వీనర్ నర్రా సంపత్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరసయ్య మాదిగ

బౌద్ధనగర్: ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో పెట్టి ఆమోదించాలనీ ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ ఇనుముల నరసయ్య మాదిగ డిమాండ్ చేశారు. గురువారం పార్సీగుట్టలో ఎంఎస్‌పీ , ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల హైదరాబాద్ జిల్లా అత్యవసర సమావేశం జరిగింది. ఎంఎస్‌పీ నాంపల్లి ఇంచార్జ్ డప్పు మల్లికార్జున్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యతిథిగా ఇనుముల నరసయ్య హాజరై మాట్లాడారు. ఈ నెల 18 నుంచి 22 వరకు అత్యవసరంగా జరుగనున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలనీ, తద్వారా కేంద్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ రాగళ ఉపేందర్ మాదిగ, సికింద్రాబాద్ ఇంచార్జి మంథిని సామ్యేల్ మాదిగ పాల్గొన్నారు.

అట్టహాసంగా లాస్య జన్మదిన వేడుకలు



లాస్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. తిరుమలగిరి నుంచి మొదలుకుని జేబీఎస్ వరకు కార్ల ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్ఖానాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో లాస్య నందిత కేక్ కట్ చేశారు. అంతకు ముందు లాస్య నందిత మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

రోడ్లపై పొంగి పొర్లుతున్న మురుగు నీరు

అపరిశుభ్రత తాండవిస్తున్న బస్తీలు, కాలనీ రోడ్లు



తార్నాక స్ట్రీట్ 1లో రోడ్డుపై పారుతున్న మురుగు

లాలాపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తార్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజి వ్యవస్థ పాడైంది. ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా మ్యాన్ హోళ్లు పొంగి మురుగు నీరు రోడ్లపై పారుతున్న దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. తార్నాక కాలనీ, శాంతి నగర్, లాలాలపేట బస్తీ అంతర్గత రోడ్లపై మురుగు నీరు వరదలా ప్రవహిస్తోంది. దీంతో బస్తీ, కాలనీ అంతర్గత రోడ్లపై అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది. దాని నుంచి వెదజల్లుతున్న దుర్గంధంతో ప్రజల ముక్కుపుటాలు అదురుతున్నాయి. వృద్ధులు, పిల్లలు శ్వాస సంబంధ సమస్యల భారిన పడుతున్నారు. తార్నాక స్ట్రీట్ నెంబర్ 1లో మ్యాన్ హోల్‌లు పొంగి దుర్గంధం రోడ్డుపై పారుతుండటంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. అసలే వర్షా కాలం ఈగలు, దోమలు స్వైర విహారం చేసి ప్రజలు విష జ్వరాలబారిన పడే ప్రమాదం ఉందని కావున సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలనీ తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ ప్రసిడెంట్ డా. పి. మోహన్‌రావు అధికారులను కోరారు.

ఛిద్రమైన రహదారులు



ధ్వంసమైన లాలాపేట ఇందిరానగర్ రోడ్డు



లాలాపేట: భారీ వర్షాలు వరదలకు తార్నాక డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడా రహదారులు అంతర్గత రోడ్లు పాడై ఛిద్రమైనాయి. లాలాపేట ప్రధాన రహదారి కల్వర్టు వద్ద, సత్యానగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే అంతర్గత రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్‌లు ధ్వంసం అయ్యాయి. తెరుచుకుని ఉన్న మ్యాన్‌హోల్‌తో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రాత్రి వేళలలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. కావునా అధికారులు స్పందించి తక్షణమే రోడ్ల మరమతు చేపట్టాలనీ ఇందిరా నగర్ సంక్షేమ అధ్యక్షులు నేతికార్ మహేశ్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.